మంజరి

సురజాపు రాజశేఖర్

మంజరి ఆపాదమస్తకము అవమానంతో భగ, భగ లాడుతోంది. ఎంత మరచిపోదామన్నా దుర్గమ్మ మాటలు, ఆ మాట్లాడిన తీరు మళ్ళి మళ్ళి గుర్తుకు వచ్చి మనసును మండిస్తున్నాయి.

దుర్గమ్మ వయసుతో నిమిత్తం లేకుండా షోకులన్నీ పదింతలుగా చేసుకుంటుంది. నలభై దాటిన తరువాత అలాంటి షోకులన్నీ అందానికి బదులు అసహ్యాన్ని కల్గిస్తాయనే ఆలోచన కూడా రాదామెకు.

దుర్గమ్మ రావటం మంజరికి ఎంతమాత్రము ఇష్టం లేదు. అయినా 'రావద్దు' అని అనలేదు. ఆ పల్లెటూళ్ళో ఎవరు బాహాటంగా ఎవర్నీ ఏమీ అనలేరు. ప్రతి ఒక్కరు ఒకరి వెనుకన ఒకరు నేరాలు చెప్పుకుంటునే ఉంటారు.

ముఖం నిండా సంతోషాన్ని పులుముకుని వచ్చింది దుర్గమ్మ.

"ఇదిగో మంజు ఎంత తియ్యటి వార్త తెచ్చానో తెలుసా! ముందు నా నోటిని తీపి చెయ్యి—ఆ తరువాతనే సంగతి చెప్పేది—"

ఎదుటివాళ్ళ పచ్చదనాన్ని చూసి ఏమాత్రమూ ఓర్వలేని ఆ ముఖంలో సంతోషం చూసి భయపడింది కాని, దుర్గమ్మ నోటిని మాత్రం తీపి చెయ్యలేదు మంజరి. దుర్గమ్మ మూతిని ముప్పైఆరు వంకర్లు తిప్పింది.

"ఏమిటమ్మా కదలవు? ఓయబ్బో...అవునులే! ఇప్పుడు నీవు ఎంత బెట్టు చేసినా చెల్లుతుంది. కలవారి కాబోయే కోడలవి కదా!"

"ఏమిటండి" తీక్షణంగా అడిగింది మంజరి—

"అబ్బో....ఆ విసురు, ఆ దురుసు అన్నీ పోతాయి. ఎలా అయితేనేం వెంకటరత్నంగార్ని నిన్ను పెళ్ళి చేసుకోవడానికి ఒప్పించేటప్పటికి నా తల ప్రాణం తోకకొచ్చిందంటే నమ్ము!"

"వెంకటరత్నంగారా...."

అప్రయత్నంగా మంజరి గుండె జల్లుమంది. గొంతు తడారిపోయింది. దగ్గర, దగ్గర అరవై పైన వయస్సు-తొమ్మిదిమంది పిల్లలు—ఆరుగురు మనవలు. కొద్దిక్షణాలు మవునంగా ఉండిపోయింది మంజరి.

"తెల్లబోతావేమ్మా? అవునులే! అసలు వెంకటరత్నంగారు ఒప్పుకోవడం అంటే మాటలా? ఏదో ఆయన నేను చెప్పబట్టి విన్నారు. అవునులెండి పిల్ల కాస్త పెద్దదే! మీకూ వయసుండిగా!....మీకు ఆదరణ కావాలయ్యే....మీలాంటివాళ్ళు ఆ పేదపిల్లను కరుణించకపోతే, ఇక ఆ పిల్లకి పెళ్ళయ్యేదెలా..." అని వాపోయాను. అక్కడితో ఆయన మనసు కరగి నా మాట కాదనలేక "సరే చూద్దాం!" అన్నారు—నేను ఆనందం పట్టలేక నీ దగ్గరకి పరిగెత్తుకొచ్చేసా..."

"అలాగే పరిగెత్తి ఇక్కడ్నుంచి వెళ్ళిపొండి దుర్గమ్మగారు. ఇంకొక్క క్షణం..."

మంజరి మాటలు పూర్తి కాకుండానే దుర్గమ్మ టక్కున లేచి తలుపు దగ్గర నిలబడింది. అక్కసును అణుచుకోలేక పోయిందావిడ. ఏం పోయేకాలమే! బంగారంలాంటి సంబంధం...ఇది వదులుకుంటే నీకు పెళ్ళి అవుతుందా?" అంది ఓ కాలు గడప అవతల పెడుతూ దుర్గమ్మగారు.

అప్పటిదాకా బిగపట్టిన కోపం మంజరిలో కట్టలు తెంచుకుంది. అంతే క్షణంలో మంజరి కళ్ల ఎర్రబడ్డాయి. నాదగ్గరకు ఇంకెప్పుడు సంబంధాలు తీసుకురాకు..."

"అవునులే పెళ్ళి కాలేదనే బెంగ నీకెందుకూ....ఉన్న రోగిష్టి తండ్రి నీకేం పెళ్ళి చేస్తాడూ...సంబంధాలేం వెతుకుతాడూ....అని జాలిపడి సంబంధము తీసుకుని వస్తే గౌరవం కూడా లేకుండా నన్ను పొమ్మంటావా? బుద్ధులు ఎక్కడకి పోతాయి ...సుప్పనాతి బుద్ధులు ..." దీర్ఘాలు తీస్తూ అక్కడ్నించి కదలి క్షణంలో మాయమయ్యింది దుర్గమ్మ.

దుర్గమ్మ వెళ్ళగానే దుఃఖం అణుచుకోలేకపోయింది మంజరి. తలుపులు గడియ వేసి పక్క గదిలో వున్న తండ్రికి ఏడుపు వినపడకుండా కొంగు నోటిలో కుక్కుకుంది.

తలుపు చప్పుడయ్యింది.

కళ్ళు తుడుచుకుని వెళ్ళి తలుపు తీసిందామె.

ఎదురుగా నుంచున్న ముప్ఫైఏళ్ళ యువకుడిని, అతడి చెయ్యి పట్టుకున్న ఆరేళ్ళ పాపని, ముద్దులు మూటగట్టే బాబుని చూసి ఆశ్చర్యపోయిందామె అంతకుముందు ఎన్నడూ ఆ యువకుడ్ని ఎక్కడా చూసిన గుర్తు లేదు.

మంజరి తల రేగింది. చీర నలిగి ఉంది....కళ్లు ఎర్రగా ఉన్నాయి. అప్పటిదాకా ఏడ్వటంతో ముఖం దీనంగా ఉంది.

అతని కళ్ళు సానుభూతిగా చూశాయి.

అది గుర్తించిన మంజరి మనస్సులో రోషం మేల్కొంది.

"ఎవరు మీరు....ఏం కావాలి?"

"ప్లీజ్....కొంచెము లోపలకి రానిస్తారా!" సంస్కారంతో కూడిన అతని ప్రవర్తన ముందు కటువుగా ఉండలేకపోయింది మంజరి.

"రండి" అంది.

ఇంట్లో వున్న ఒకే ఒక్క కుర్చీలో అతడ్ని కూర్చోమని, తను మంచం మీద కూర్చుంటూ పిల్లలిద్దరి వైపూ చూసింది. రమ్మన్నట్లుగా సైగచేసి వాళ్ళను కూడ మంచంమీద తన పక్కన కూర్చోబెట్టుకుంది.

"మీ పేరు మంజరి కదూ"

"అవును"

"మీ నాన్నగారి పేరు 'దశరథరామయ్యగారు కదూ"

"ఏమిటిదంతా?"

"నా పేరు యశస్వి"

"అయితే"

నెమ్మదిగా అన్నాడు యశస్వి. "నేను మిమ్మల్ని స్వీకరించాలని వచ్చాను"

కాళికలా లేచింది మంజరి.

"షటప్....మీరు ఎవరో నాకు తెలియదు. అయినా మర్యాదిచ్చి కూర్చోబెట్టాను. తక్షణం ఇక్కడ్నుంచి వెళ్ళిపొం....డి"

కంగారుగా లేచాడు యశస్వి

"నేను ఎవరో మీకు తెలిసినట్లు లేదు . నేను ..."

"నన్ను స్వీకరిస్తారా? మీ ఎవరి దయాదాక్షిణ్యాలు అక్కర్లేదు"

"దయాదాక్షిణ్యాలు చూపించడానికి రాలేదు. మిమ్మల్నే అవి చూపించమని చెప్పటానికి వచ్చాను"

"నేనేమి పిల్లల తల్లిని కాదు. రెండో పెళ్ళివాడితో, పిల్లల తండ్రితో బ్రతుకు ముడేసుకోవలసిన ఖర్మ నాకేం లేదు"

ఏదో చెప్పాలని ముందుకు వంగిన యశస్వి ఈ మాటలతో ఉలిక్కి-

పట్టాడు. అతని ముఖం ఉదాసీనంగా మారిపోయింది. కాని మర్యాదగా "క్షమించండి వెళ్తాను" అన్నాడు.

యశస్వి ధోరణి ఆమెకు కొత్తగా, వింతగా ఉంది.

"రండమ్మా" పిల్లల్ని పిలిచాడు.

అప్పటికి పాప చెయ్యి మంజరి చేతిలోనే ఉంది. ఆ చెయ్యి నెమ్మదిగా విడిపించుకొంది పాప. పాప తన పక్కనే పెట్టుకున్న పొట్లపెట్టె తీసి పద్మ చేతి కిచ్చింది.

"ఏమిటిది?"

"చీర మీకోసం తీసుకొచ్చాను"

"మీరెవరు? ఇలా అకస్మాత్తుగా రావడమేమిటి? వస్తూ చీరె తీసుకురావడ మేమిటి? నేను అడ్డమైన వాళ్ళదగ్గరా, చీరెలు సారెలు తీసుకునేదాన్నని ఎవరు చెప్పారు మీకు?"

"అన్నీ వివరంగా చెప్పాలని వచ్చాను. ఇప్పుడింక ఏమీ చెప్పాలని లేదు"

"ఎందుకు"

"మీలాంటి కన్యను నన్ను స్వీకరించమని అడగటం అన్యాయమే. స్వార్థం సరిగా ఆలోచించనియ్యలేదు"

విచిత్రంగా చూసింది మంజరి.

"మిమ్మల్ని బాధపెడితే క్షమించండి. తిరుగు బస్సుకి టైమయ్యింది. మేము వెళ్ళాలి" అంటూ లేచి నిలబడి మంచం దగ్గరికొచ్చి బాబును ఎత్తుకొని పాపను రమ్మన్నట్లుగా సైగ చేశాడు.

"ఈ చీర నేను తీసుకోను" అంది మంజరి గొంతు పెగల్చుకొని.

"పాపకు ఇచ్చెయ్యండి" చేతులు జోడించి బయటకు నడిచాడు యశస్వి. బాబుతో వెళుతున్న యశస్విని చూస్తూ ఆ పేకెట్‌ను పాప చేతిలో పెట్టింది మంజరి.

"దీంట్లో చీరె ఉంది. నాకెందుకు? నేను ఫ్రాక్ తొడుక్కుంటాను" అంటూ పాకెట్‌ను మళ్ళీ మంజరి దగ్గిరే పడేసి పరిగెత్తి తండ్రి దగ్గరకి వెళ్ళి పోయింది పాప.

తొందరపడ్డానేమోనని ఒక క్షణం బాధపడింది మంజరి. తలుపును దగ్గ రగా వేసి మంచంమీద వాలుతుండగా కనిపించింది ఆమెకు పాప వదిలి వెళ్ళిన పాకెట్. జాగ్రత్తగా విప్పిందామె పాకెట్‌ను. కనకాంబరం రంగు పట్టుచీర మెరి స్తూ కనిపించిందామెకు.

ఇంతలో లోపల్నుంచి—

"మంజూ" దశరథరామయ్యగారు పిల్చారు.

"వస్తున్నా....నాన్నా" అంటూ ఆమె చీరను [illegible] నడిచింది లోనికి.

"దాహంగా వుంది కాసిని మంచినీళ్ళు ఇస్తావామ్మా"

తీసుకొని వచ్చి ఆయన నోటికి అందించిందామె.

ఆత్రంగా అందుకున్నాడాయన గ్లాసును. "మంచి నిద్ర పట్టిందమ్మా...." అంటూ మాట్లాడుతున్న ఆయనకి అడ్డు వస్తూ "మందు వేసుకున్నావా నాన్నా" అంది మంజరి.

"లేదమ్మా" అంటూ కళ్ళు, కళ్ళున దగ్గసాగాడు ఆయన.

మంజరి ఆందోళనగా ఆయన గుండెమీద చెయ్యితో రాస్తూ "బాధగా ఉందా నాన్నా!" అంది.

"లేదమ్మా! ఏం లేదు....హాయిగా బిడ్డా, పాపలతో ఇల్లు దిద్దుకోవలసిన నువ్వు....ఈ వయస్సులో ఆ ముష్టి ఉద్యోగం చేసుకుంటూ ఈ ముసలాడితో యాతన పడుతూ... "

తండ్రి మాటలు పూర్తి కాకుండానే అసహనంగా అడ్డు తగిలింది మంజరి. "నిన్ను అలా మాట్లాడవద్దని ఎన్నిసార్లు చెప్పాను? ఇప్పుడు నాకేం తక్కువయ్యింది? హాయిగా వున్నాను. నన్ను చూసి జాలిపడాల్సిన అవసరం ఏమొచ్చింది"

దశరథరామయ్యగారు మాట్లాడలేదు. కూతురంటే ఆయనకి ప్రేమ మాత్రమే కాదు భయం కూడా.

"ఇదిగో ఈ మందు వేసుకో నాన్న" అంది మంజరి ఆయన దగ్గరకి వస్తూ.

"ఎందుకమ్మా మందులు....! త్వరగా నేను దాటిపోయే మందులుంటే ఇవ్వు...."

"నాన్నా! నేను నవ్వుతూ ఉంటే చూడలేక పోతున్నావా! నేను బావురుమని ఏడిస్తే కాని, నీ కడుపు చల్లబడదా? కాని నేను ఏడవను నాన్న, ఏడ్వటానికి పుట్టలేదు నేను"

నవ్వుతూ నిర్లక్ష్యంగా మాట్లాడుతున్న మంజరిని చూస్తుంటే ఆయనకి దుఃఖము పొంగుకు వచ్చింది.

"లేదు తల్లి....లేదు. అప్పుడప్పుడు పిచ్చిగా వాగుతూ వుంటాను. మందివ్వమ్మా....ఇవ్వు" నవ్వడానికి ప్రయత్నించాడు దశరథరామయ్యగారు. గ్లాసులో మందు కలపి ఆయనకిచ్చి, ముందర గదిలోనికి వచ్చింది మంజరి భారంగా.

అదే క్షణంలో వచ్చింది సుభద్ర.

ఆ పిల్లకి పట్టుమని పదిహేనేళ్ళుండవు. అన్నీ ముది కబుర్లే. ఆ పిల్లతల్లి ఆ అమ్మాయి ఎదురుకుండానే తన కూతురికి ఇంకా పెళ్ళి కాలేదనే ఆరాటం బయటపెడుతుంది. అక్కడితో ఆ అమ్మాయికి కూడా తను త్వరగా పెళ్ళి చేసుకోవాలనే తపన బయలుదేరింది.

"మంజక్క ఇందాకడ ఎవరు వచ్చారు"

"నాకు తెలీదు"

"బాగా డబ్బున్నవాడిలా వున్నాడు"

"మరేమో"

"చాలా బావున్నాడు కదూ!"

మంజరి విచిత్రంగా చూసింది.

"నిన్ను పెళ్ళి చేసుకోమని అడిగాడు కదూ"

"నీకెలా తెలుసు"

"చాటుగా విన్నాను"

సుభద్రనె కళ్ళప్పగించి చూస్తూండిపోయింది మంజరి.

"అక్కా! పోని ఆయన సంగతి మా అమ్మకు చెప్పకూడదూ"

"నువ్వు ఎలాగు చేసుకోను అన్నావుగా పోనీ నాకు ప్రయత్నిస్తుంది"

నిర్ఘాంతపోయి చూస్తూండిపోయింది మంజరి.

సుభద్ర సిగ్గుపడుతూ మెలికలు తిరిగిపోయింది.

"ఫో అక్కా! అలా చూడకు నాకు సిగ్గేస్తుంది" అంటూ లేడిపిల్లలా పారిపోయింది.

క్రమ, క్రమంగా మంజరి ముఖంలో నవ్వు చోటు చేసుకోసాగింది.

"ఎవరమ్మా మంజు వచ్చింది" దశరథరామయ్యగారు అడిగారు.

"ఎదురింటి పరమేశ్వరశాస్త్రిగారి కూతురు నాన్న"

"అమ్మా! మంజు ఒక్కసారి ఇలా నా ప్రక్కన కూర్చో తల్లీ" ప్రేమగా పిల్చారు దశరథరామయ్యగారు.

"నాన్నా" అంది మంజరి మంచము మీద కూర్చుంటూ.

"పట్నంలో వున్న గోపాలం బాబాయికి ఉత్తరం వ్రాయాలమ్మా"

"రెండో రోజులు క్రితమే కదా నాన్న ఉత్తరం వ్రాయించావు. అప్పుడే ఎందుకు" అంది మంజరి.

"లేదమ్మా వ్రాయాలి తప్పకుండా వ్రాయాలి....లేకపోతే"

"ఏమవుతుంది నాన్నా, ఏమీ అవదు. నా పెళ్ళి సంబంధాలు గురించేగా వ్రాయమంటావు. వద్దు ఆ విషయమయితే అసలే వద్దు" అందామె చిరుకోపంగా

"అవునమ్మా! కన్నతండ్రిని కదా! కళ్ళు లేకపోయినాగాని, ఈ మంచంలోంచి లేవలేకపోయినా గాని, కన్నతండ్రిగా...నా బాధ్యతగా ఏదో ఒకటి చెయాలి కదమ్మా" అన్నారాయన.

"నీవు ఏమి చేయనక్కర్లేదు నాన్న. ఇలా మాట్లాడి నన్ను బాధపెట్టకుండా వుంటే చాలు" అంది మంజరి గాద్గదిక స్వరంతో.

"అవునమ్మా బాధపెట్టాను. ఇక నిన్ను బాధ పెట్టను తల్లి బాధ పెట్టను...."

"ఎందుకు నాన్న అలా బాధపడతావు. అసలే నీ ఆరోగ్యం బాగాలేదు"

"రేపో, మాపో రాలిపోయే ఈ వృద్ధుడి కోసం పండంటి నీ జీవితాన్ని నాశనం చేసు..." మిగిలిన మాటలను దగ్గు మింగేసింది.

"ఎందుకు నాన్న ఆవేశపడతావు" అంటూ మంజరి ఆయన గుండెలను చెయ్యితో రాయసాగింది.

"మంజు...పెన్ను కవరు తీసుకురా తల్లి"

....

"ఈ ఒక్కసారికేసమ్మా. ఇంకెప్పుడూ నిన్ను ఉత్తరం వ్రాయమని విసిగించను"

మంజరికి బాధగాను, విసుగ్గాను వుంది. కవరు, పెన్ను తీసుకు రావడానికి ముందర గదిలోనికి వెళ్ళిందామె.

"మంజూ పెన్ను, కవరు తీసుకు వస్తున్నావా" గట్టిగా పిల్చారు దశరథరామయ్యగారు.

"ఇదిగో" అంటూ ఆయన ప్రక్కన కూర్చుంది మంజు. కొద్ది క్షణాలు మవునంగా ఉండిపోయారాయన.

"మంజు నేను ఉత్తరం చెప్పటం ముగించేంతవరకు నువ్వు మాట్లాడవద్దు"

"అలాగే....చెప్పండి"

"ఊ ..."

"నాన్న ఉత్తరం చెప్పండి" కొంచెం గట్టిగా అంది మంజరి. గొంతుకను సవరించుకున్నారు దశరథరామయ్యగారు.

"కొంచెము నెమ్మదిగా వ్రాయమ్మ"

లవ్ ఈజె జర్నీ

ఎన్ని కోట్ల నిస్పృహా నిరీక్షణల
ఎడారి ఇసుక కణాలు గడిచి,
ఎన్ని తాత్కాలికానందాల ఒయాసిస్సులని
దిగవిడచి
నీ ప్రేమ మధ్యధరా వాతావరణాన్ని
చేరుకోవాలనుకున్నాను!
చూడు, నీ రాజీత్వపు అంబారీని మోసి
నాభుజాలెలా ఒంటెల మూపుల్లా
వంగిపోయాయో
ఈ ఖర్జూరవృక్షం క్రింద
నీ అనురాగాన్ని చవిచూడాలని ఆశతో
నడచి వచ్చిన నాకాళ్లెలా
ఒంటె కాళ్లలా మందగించాయో చూడు
అంతులేని ఆనందపు ఇంద్ర ధనుస్సులు
నిదురవుతాయనుకున్న నేను
నిరుత్సావశక్యం గాని మరీచికల భ్రమలలో
పడి జాడలేకుండా కొట్టుకు పోయాను.

శ్రీ దేశెట్టి కేశవరావు

గానం

కన్నడమూలం: డా॥ కె.వి. పుట్టప్ప.
అనువాదం : మార్కండపురం శ్రీనివాస

దూరానికి దూరానికి బహు బహు దూరానికి
ఎగిరెద గావ విమానములో;
మేఘపు దూరానికి, గగనపు దూరానికి,
శశిరవి తారల అవతల తీరానికి
మామికు, అందని భవ్య అపారానికి,
మనసుకు అందని దివ్య అతీతానికి,
దూరానికి దూరానికి బహు బహు దూరానికి,
ఎగిరెద గాన విమానములో!
ఎగురుతు ఎగురుతు భూర్భువ స్వర్గములను
ఆత్మవిలయములో కౌగిలించెద
ఎండకు ప్రసరించెడి మంచువోలె
లోకలోకాలు ప్రసరించెద!

"అలాగే నాన్న" వ్రాయడానికి ఉపక్రమించిందామె.

చెప్పటం ప్రారంభించారు ఆయన—

చిరంజీవి గోపాలానికి ఆశీర్వచనములతో దశరథరామయ్య వ్రాయునది. నా ఆరోగ్యం అంతంత మాత్రంగా వున్నది. నేను ఎక్కువ కాలం జీవించక పోవచ్చు. నీకొక ముఖ్య విషయం వ్రాస్తున్నాను. ఈరోజు మధ్యాహ్నం యశస్వి వచ్చి వెళ్ళాడు....

అంతే ఉత్తరం వ్రాస్తున్న మంజరి గుండె ఒక్కసారిగా ఆగిపోయి మళ్ళీ కొట్టుకోసాగింది వేగంగా. ఏదో అందామని నోరు తెరచింది కాని మాట పెగల్లేదు.

అదే క్షణంలో కళ్ళు, కళ్ళుమని దగ్గసాగారు దశరథరామయ్యగారు. దగ్గు క్రమ, క్రమేపి ఎక్కువ కాసాగింది. ఆందోళనగా లేచింది మంజరి. ఉత్తరం, పెన్ను ప్రక్కనబెట్టి. గట్టిగా పట్టుకుందామె తండ్రిని.

ఉన్నట్టుండి దగ్గు ఆగిపోయిందాయనకు. ముక్కు వెంట నెత్తురు రాసాగింది. అలా ఎప్పుడూ ఆమె చూసి ఉండలేదు.

భయపడిపోయింది మంజరి.

మంచం మీద వెనక్కి వాలిపోయారు దశరథరామయ్యగారు.

"నాన్న....నాన్న..." ఆందోళనగా భయంగా పిలిచిందామె. ప్రక్కనే వున్న గుడ్డతో ముక్కుని తుడిచింది.

మెల్లగా విచ్చుకున్నాయి ఆయన పెదవులు. "బాబాయిని....బాబాయిని....రమ్మని వ్రా....నే...." అంటూండగానే దగ్గు తెర వచ్చి మిగతా మాటలను మింగేసింది.

"మాట్లాడకు నాన్న ...కాస్సేపు విశ్రాంతి తీసుకో" అంది మంజరి ఏడుపు గొంతుకతో.

"విశ్రాంతి....ఇలా బ్రతుకుతూ నిన్ను పెళ్ళి కాకుండా చూడటం నా దౌర్భాగ్యమమ్మా" అంటూ తలక్రింద ఉన్న దిండు క్రింద తడిమి ఒక చిన్న కాగితాన్ని బయటకు తీసారు

"ఏమిటి నాన్న అది!"

"నీ జీవితం తల్లీ .." ఇంకేదో అంటుండగానే ఒక్కసారిగా గుండె పట్టుకొని బాధతో మెలికలు తిరిగిపోయారు దశరథరామయ్యగారు. అదే క్షణంలో ఆయనలోని జీవుడు అనంతాల్లోకి దూసుకుపోయాడు.

పిచ్చిదానిలా చూస్తూండిపోయింది మంజరి.

నెమ్మదిగా తండ్రి ఇచ్చిన కాగితంకేసి చూసింది. 'యశస్వి అని మన బంధువులు కుర్రాడు. మంజరిని చూడడానికి ఎల్లుండి వస్తున్నాడు—గోపాలం వెక్కిరిస్తూ కనిపించాయామెకా అక్షరాలు.

నెమ్మదిగా లేచి నిలబడిందామె. తెరచి వున్న దశరథరామయ్యగారి నోటిని చెయ్యితో మూసింది. నెమ్మదిగా, అతినెమ్మదిగా యేడ్వసాగిందామె. క్రమక్రమేపి ఏడుపు తగ్గసాగింది. అంతే! ఒక్కసారిగా మంజరి నవ్వసాగింది. ●